పోలింగ్‌లో పొరపాట్లకు తావివ్వొద్దు

- అదనపు కలెక్టర్ రాంబాబు

చివ్వెంల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ రాంబాబు

చివ్వెంల, ఫిబ్రవరి 26: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికను పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ పి.రాంబాబు అన్నారు. చివ్వెం, మోతె, ఆత్మకూర్(ఎస్) మండల కేంద్రాల్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను బుధవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. గురువారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరిగే పోలింగ్ ఎటువంటి పొరపాట్లు జరుగకుండా జాగ్రత్తగా విధులు నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో తాసీల్దార్లు కృష్ణయ్య, శ్యామ్ సుందర్‌రెడ్డి, హరిశ్చంద్రప్రసాద్, ఆర్ఐలు శ్రావణి, శ్రీను పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న సిబ్బంది

ఆత్మకూర్.ఎస్: పోలింగ్ సామగ్రిని పరిశీలిస్తున్న తాసీల్దార్ హరిశ్చంద్రప్రసాద్

తుంగతుర్తిలో పోలింగ్ కేంద్రానికి సామగ్రితో చేరుకున్న సిబ్బంది

ఆత్మకూర్.ఎస్, ఫిబ్రవరి 26: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక విధుల్లో పాల్గొనే సిబ్బంది బుధవారం పోలింగ్ సామగ్రితో కేంద్రాలకు చేరుకున్నారు. ఆత్మకూర్.ఎస్ మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని తాసీల్దార్ హరిశ్చంద్రప్రసాద్ సందర్శించి పోలింగ్ సామగ్రిని పరిశీలించారు.

పెన్‌పహాడ్: ఎమ్మెల్సీ ఎన్నికకు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోలింగ్ స్టేషన్ 151లో పూర్తి ఏర్పాట్లు చేశామని తాసీల్దార్ దరావత్ లాలునాయక్ తెలిపారు. మొత్తం 52 మంది ఓట్లు సద్వినియోగం చేసుకోనున్నారని పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం సిబ్బంది పోలింగ్ కేంద్రానికి చేరుకున్నారని తెలిపారు. రూట్ ఆఫీసర్‌గా నేరేడుచర్ల తాసీల్దార్ సురభి సైదులు విధులు నిర్వహిస్తారని అన్నారు.

తిరుమలగిరి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన 141 నంబర్ పోలింగ్ కేంద్రానికి బుధవారం ఎన్నికల సిబ్బంది చేరుకున్నారు. ఈ పోలింగ్ కేంద్రంలో మొత్తం 59 మంది ఓటు హక్కు వినియోగంచుకోనున్నారు. కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారి బ్రహ్మయ్య, తాసీల్దార్ హరిప్రసాద్ పాల్గొన్నారు.

తుంగతుర్తి: మండల కేంద్రంలో పోలింగ్‌కు సర్వం సిద్ధం చేసినట్లు తాసీల్దార్ దయానందం తెలిపారు. మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని ఆయన సందర్శించి మాట్లాడారు. 54 మంది ఓటు వేయనున్నారని తెలిపారు.

మద్దిరాల: మండల కేంద్రంలోని పోలింగ్ కేంద్రంలో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తాసీల్దార్ అమీన్‌సింగ్ తెలిపారు. ఎన్నికలు సజావుగా జరిగేందుకు పటిష్ట భద్రత ఏర్పాటు చేయడం జరిగిందని వివరించారు.

తిరుమలగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చేరుకున్న ఎన్నికల సిబ్బంది

కాంగ్రెస్ పాలనలో రైతులకు కష్టాలు

- సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు నెమ్మాది వెంకటేశ్వర్లు

ఎండిన పొలాలను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

పెన్‌పహాడ్, ఫిబ్రవరి 26: కాంగ్రెస్ పాలనలో రైతులకు కష్టాలు తప్పడం లేదని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు నెమ్మాది వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని చిన గ్యారకుంట తండాలో ఎండిపోయిన వరి పొలాలను సీపీఎం నాయకులతో కలిసి బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నీటిపారుదలశాఖ అధికారుల తప్పుడు సమాచారం వల్ల పెన్‌పహాడ్ మండలంలో శ్రీరామ్ సాగర్ ఆయకట్టు పరిధిలో వేలాది ఎకరాల్లో వరి పొలాలు ఎండిపోయాయని ఆరోపించారు. శ్రీరామ్‌సాగర్ కాల్వల ద్వారా యాసంగి సాగుకు నీటిని విడుదల చేస్తామని ప్రభుత్వం చెప్పడంతో రైతులు పంటలు సాగు చేశారని, తీరా పొలాలు పొట్టకొచ్చే సమయానికి నీళ్లు లేక ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారని అన్నారు. ఆత్మకూర్.ఎస్ మండలంలో ఎస్సారెస్పీ ప్రధాన కాల్వ వద్ద స్థానిక రైతులు తూములు మూసి వేయడంతో పెన్‌పహాడ్, మునగాల మండలాలకు చెందిన రైతులకు నీరు రాకుండా పోయిందని అన్నారు. నీటి సరఫరాను పునరుద్ధరించేందుకు సంబంధిత అధికారులు చర్యలు చేపట్టకపోవడంతో పెన్‌పహాడ్, మునగాల మండలాలకు చెందిన రైతాంగం తీవ్రంగా నష్టపోయారని అన్నారు. జిల్లాకు చెందిన నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి హుజూర్‌నగర్ నియోజకవర్గం మీద ఉన్న దృష్టి జిల్లా మొత్తం మీద లేకపోవడంతో వేల ఎకరాల్లో వరి పంట ఎండిపోయిందని, దీనికి నీటిపారుదలశాఖ అధికారులు, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి బాధ్యత వహించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి ఎండిపోయిన పొలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి సర్వే చేసి రైతులను ఆదుకోవాలని, ఎకరాకు రూ.30 వేల నష్ట పరిహారం ఇవ్వాలని, పంట బీమా సౌకర్యం కల్పించాలని కోరారు.కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి గుండ వెంకటేశ్వర్లు, రైతులు దరావత్ నగేశ్, వీరన్న, బండి శ్రీనివాస్‌రెడ్డి, దరావత్ లక్ష్మి, దరావత్ భీమ్లా, సైదులు, చాక్రియా, దస్రూనాయక్, నాగు, చందర్, ఉప్పుల రాంరెడ్డి, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ NAMASTHE TELANGANA CLASSIFIEDS

వధువు కావలెను
ఆర్య వైశ్య అబ్బాయి 1989, M.Ed. పార్ట్ టైమ్ లెక్చరర్, వ్యవసాయం, 14x2=28 వేలు, ఆస్తి 70 లక్షలు, నల్లగొండ, వీరయ్య 9121325068, కోమట్ల అమ్మాయి కావలెను 1వ, M9HB, మునుగోడు రోడ్డు. NLG-

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన తతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం... మన "నమస్తే తెలంగాణ" క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం...
ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/- ప్రతి అదనపు లైన్‌కు 50/-
Note: 3+1 Scheme Available Minimum 4 Lines, Extra Line - Extra Amount 5% GST అదనం
మరిన్ని వివరాలకు: నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం, గ్రా: చర్లపల్లి, మం: నల్లగొండ.
నల్లగొండ: 9182777626 | నల్లగొండ: 9182777635 | దేవరకొండ: 9182777635
హాలియా: 9182777059 | సూర్యాపేట: 9182777630 | భువనగిరి: 9182777638
మిర్యాలగూడ: 9182777059 | కోదాడ: 9182777630 | హుజూర్: 9182777638

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు ఏర్పాట్లు పూర్తి

- జిల్లాలో 23 పోలింగ్ కేంద్రాలు
- ఓటు హక్కు వినియోగించుకోనున్న 2,664 మంది ఉపాధ్యాయులు
- కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

సూర్యాపేట, ఫిబ్రవరి 26: నల్లగొండ, ఖమ్మం, వరంగల్ నియోజకవర్గ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ తెలిపారు. పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని ఆయన సందర్శించి పోలింగ్ సామగ్రి పంపిణీ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో 23 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. 2,664 మంది ఓటు హక్కును వినియోగించుకోనున్నారని, వారిలో 1,702 మంది పురుషులు, 962 మంది మహిళా ఓటర్లు ఉన్నారని తెలిపారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఏవీఎం స్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో అత్యధికంగా 991 మంది ఓటర్లు ఉన్నారని, అతి తక్కువగా చింతలపాలెం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో 12 మంది ఓటర్లు ఉన్నట్లు చెప్పారు. గురువారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఓటింగ్ కొనసాగుతుందన్నారు. ఈ ఎన్నికల నిర్వహణ కోసం 28 మంది ప్రిసైడింగ్ ఆఫీసర్లు, 28 మంది పోలింగ్ ఆఫీసర్లు, 55 మంది ఓపీ ఓలు, 28 మంది మైక్రోఅబ్జర్వర్లు విధులు నిర్వహించనున్నారని తెలిపారు. డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి సిబ్బంది వారికి కేటాయించిన వాహనాల్లో నేరుగా పోలింగ్ కేంద్రాలకు చేరుకొని, పోలింగ్ నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద కట్టుదిట్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తాయని తెలిపారు. ఓటర్ల సంఖ్య ఎక్కువగా ఉన్న పోలింగ్ కేంద్రాలకు పీఓ, ఏపీఓ, ఇద్దరు ఓపీఓలతో పాటు అదనపు సిబ్బందిని నియమించామని చెప్పారు. ఉపాధ్యాయులు ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాంబాబు, ఆర్డీఓ వేణుమాధవ్, డీఎస్పీ రవి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మండలాల వారీగా ఓటర్ల వివరాలు..

సూర్యాపేట మండలంలో 991 మంది, తిరుమలగిరి 59, తుంగతుర్తి 54, నూతనకల్ 41, మద్దిరాల 29, ఆత్మకూర్(ఎస్) 52, జాజిరెడ్డిగూడెం 23, నాగారం 23, నడిగూడెం 48, మునగాల 65, పెన్‌పహాడ్ 52, గరిడేపల్లి 94, చిలుకూరు 102, కోదాడ 472, అనంతగిరి 25, హుజూర్‌నగర్ 185, మఠంపల్లి 34, నేరేడుచర్ల 95, పాలకవీడు 22, చివ్వెంల 117, మోతె 48, మేళ్లచెర్వు 21, చింతలపాలెం మండలంలో 12 మంది ఓటర్లు ఉన్నారు.

మైనింగ్ తవ్వకాల అడ్డగింత

తొండ గ్రామంలో మైనింగ్ తవ్వకాలను అడ్డుకుంటున్న గ్రామస్తులు

తిరుమలగిరి, ఫిబ్రవరి 26: మండలంలోని తొండ గ్రామంలో చేపడుతున్న మైనింగ్ తవ్వకాలను బుధవారం గ్రామస్తులు అడ్డుకున్నారు. తొండ గ్రామంలోని పోరెల్ల గుట్టలో మైనింగ్ తవ్వకాల కోసం ఓ కంపెనీ 2018వ సంవత్సరంలో దరఖాస్తు చేసుకోగా 2023లో గ్రామసభ తీర్మానం లేకుండానే ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. అయితే, అప్పటి నుంచి గ్రామస్తులు గ్రామ సభ తీర్మానం లేకుండా అనుమతులు ఎలా ఇస్తారని మైనింగ్ తవ్వకాలు జరుపకుండా అడ్డుకుంటున్నారు. ఈ క్రమంలో పోలీసులు రంగ ప్రవేశం చేసి ఇరువర్గాలకు నచ్చజెప్పి పనులను నిలిపి వేశారు. కార్యక్రమంలో నీరటి ప్రవీణ్, రమేశ్, చంద్రయ్య, నవీన్, వెంకన్న, అంజయ్య, యాదగిరి, గొడుగు సోమయ్య, సోమనర్సయ్య పాల్గొన్నారు.

ఎల్ ఈడీ బల్బులు వితరణ

ఎల్ఈడీ బల్బులు అందజేస్తున్న చంటినాయక్

హుజూర్‌నగర్ రూరల్, ఫిబ్రవరి 26: మండల పరిధి శ్రీనివాసపురం గ్రామంలో వీధి లైట్లు లేక రాత్రిపూట అంధకారం నెలకొంటుండడంతో గ్రామానికి చెందిన బాణోతు చంటి నాయక్ స్పందించి బుధవారం 30 ఎల్ఈడీ బల్బులు వితరణ చేశారు. గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ఆలయానికి..

పెన్‌పహాడ్:నాగులపహాడ్ శివాలయానికి గ్రామానికి చెందిన ఎలుక సైదులు, మమత దంపతులు బుధవారం రూ.10 వేల విలువైన ఎల్ఈడీ లైట్లను వితరణగా అందజేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ పొగుల జానయ్యగౌడ్, గౌరవాధ్యక్షుడు జాన కిరాములు, నిరంజన్‌రెడ్డి, అంజయ్య, దామోదర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'సేవాలాల్ జయంతి వేడుకలను జయప్రదం చేయాలి'

పాలకవీడులో మాట్లాడుతున్న మాజీ ఎంపీపీ గోపాల్

మఠంపల్లి: మాట్లాడుతున్న నవీన్‌నాయక్

మఠంపల్లి, ఫిబ్రవరి 26: హుజూర్‌నగర్ నియోజకవర్గ కేంద్రంలో ఈ నెల 28వ తేదీన నిర్వహించే సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతికి గిరిజనులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షుడు ధరావత్ నవీన్ నాయక్, ఉత్సవ కమిటీ కన్వీనర్, కో కన్వీనర్లు తులసీరామ్ నాయక్, సైదులు నాయక్ కోరారు. ఈ మేరకు బుధవారం మఠంపల్లిలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు బాణోతు భాస్కర్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ బాబునాయక్, రాముడు, వీటినాయక్, పాండునాయక్, ప్రేమ్‌నాయక్, గోవిందు, శ్రీనునాయక్, మాళోతు రవీందర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

గరిడేపల్లి: 28న హుజూర్‌నగర్‌లో సేవాలాల్ 286వ జయంతిని నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షుడు ధరావత్ నవీన్ నాయక్ తెలిపారు. బుధవారం కీతవారిగూడెంలో ఆయన విలేకరులకు వివరాలు వెల్లడించారు.

పాలకవీడు, ఫిబ్రవరి 26: హుజూర్‌నగర్ నిర్వహించే సంత్ సేవాలాల్ జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని మాజీ ఎంపీపీ గోపాల్ కోరారు. బుధవారం పాలకవీడు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన గిరిజన నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బంజారాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్‌ను స్మరించుకోవడానికి ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్న ఈ ఉత్సవాల్లో రాజకీయాలకు అతీతంగా బంజారా నాయకులు, ఉద్యోగులు, వ్యాపారులు స్వచ్ఛందంగా పాల్గొనాలని కోరారు. సమావేశంలో నాయకులు మోతీలాల్‌నాయక్, తులసీరామ్‌నాయక్, సైదులు, మధు, పాండు, శ్రీను, నాగేశ్వరరావు, నరీ నాయక్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

'అన్నదానం మహాదానం'

అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న బీఆర్ఎస్ నాయకుడు అప్పారావు

కోదాడ రూరల్, ఫిబ్రవరి 26: అన్నదానం మహాదానమని బీఆర్ఎస్ మండల నాయకుడు దొంతగాని అప్పారావు అన్నారు. మహాశివరాత్రిని పురస్కరించుకొని బుధవారం మండల పరిధిలోని కాపుగల్లు వీరన్నస్వామి దేవాలయంలో భక్తులకు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం

చౌటుప్పల్, ఫిబ్రవరి 26 : పట్టణ కేంద్రంలో బుధవారం ఓ వివాహిత అదృశ్యమైంది. చిట్యాల మండలం వెలిమినేడు గ్రామానికి చెందిన దేశగోని మల్లేశ్ యాదవ్ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తూ కుటుంబంతో కలిసి చౌటుప్పల్ పట్టణంలోని హెచ్ఎండీఏ వెంచర్‌లో నివాసముంటున్నాడు. ఈ నెల 25న వ్యక్తిగత పని నిమిత్తం మల్లేశ్ యాదవ్ నల్లగొండకు వెళ్లాడు. ఈ క్రమంలో ఆయన భార్య అలివేలు అలియాస్ అంజలికి అదే రోజు ఆయన ఫోన్ చేయగా కుమారుడు అర్జున్ ఫోన్ ఎత్తి.. తల్లి లింగోజిగూడెంలోని అమ్మమ్మ ఇంట్లో తనను దింపి బ్యాంక్‌కు వెళ్లి వస్తానని చెప్పిందని సమాధానం ఇచ్చాడు. ఆ రోజు నుంచి ఆమె తిరిగి ఇంటికి రాలేదు. బంధువులు, స్నేహితుల ఇంట్లో వెతికినా ఆచూకీ తెలియకోవడంతో బుధవారం మల్లేశ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఖైతాపురంలో మరో మహిళ..

చౌటుప్పల్ మండలం ఖైతాపురం గ్రామంలో మరో మహిళ అదృశ్యమైంది.గ్రామానికి చెంది న గోపనబోయిన లింగస్వామి-లావణ్య దంపతులకు ముగ్గురు పిల్లలున్నారు. మంగళవారం రాత్రి వీరంతా ఇంట్లో భోజనం చేసి నిద్రించారు. తెల్లవారుజామున 3 గంటలకు లింగస్వామి లేచి చూడగా భార్య కనిపించలేదు. ఎక్కడ వెతికినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

రామన్నపేట, ఫిబ్రవరి 26 : అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని వేములకొండలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన కొలగాని వెంకటేశ్(58) మేస్త్రీ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. వ్యక్తిగత పని నిమిత్తం మంగళవారం మండలంలోని లక్ష్మాపురం గ్రామానికి మధ్యాహ్నం 2 గంటల సమయంలో వెళ్లాడు. రాత్రి 9 గంటలైనా ఇంటికి రాకపోవడంతో భార్య ఫోన్ చేయగా వస్తున్నానని చెప్పాడు. కానీ రాత్రి మొత్తం ఇంటికి రాలేదు. బుధవారం ఉద యం లక్ష్మాపురం గ్రామానికి చెందిన జోగుల నర్సింహ వాకింగ్‌కు వెళ్లగా మూసీ నది బ్రిడ్జి కింద వ్యక్తి మృతి చెంది ఉండడాన్ని గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. వెంకటేశ్ కుమారుడు కొలగాని మహేశ్ ఘటనా స్థలానికి చేరుకొని మృతి చెందనది తనే తండ్రేనని గుర్తించి, మృతిపై అనుమానాలు ఉన్నాయని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ మల్లయ్య కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు పేర్కొన్నారు.

కోదాడ ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు మృతి

కోదాడ టౌన్, ఫిబ్రవరి 26: కోదాడ ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు పడిశాల రఘు మృతిచెందారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆయనను కుటుంబ సభ్యులు మంగళవారం సాయంత్రం పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉందని, ఖమ్మం తీసుకెళ్లాలని వైద్యులు సూచించడంతో అంబులెన్స్‌లో తరలిస్తుండగా మార్గం మధ్యలో గుండెపోటుతో మృతి చెందారు. రఘు భౌతికకాయానికి సూర్యాపేట డీఎస్పీ రవి, జిల్లా ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు కారింగుల అంజన్‌గౌడ్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు నహీం, శ్రవణ్, జర్నలిస్టు సంఘం నాయకులు నివాళులర్పించారు.

శివనామ స్మరణతో మార్మోగిన ఆలయాలు

పిల్లలమర్రి శివాలయంలో స్వామివారి కల్యాణానికి హాజరైన భక్తులు

సూర్యాపేట టౌన్/సూర్యాపేట రూరల్/మేళ్లచెర్వు/నేరేడుచర్ల/మఠంపల్లి/చివ్వెం, ఫిబ్రవరి 26: మహాశివరాత్రిని పురస్కరించుకొని జిల్లాలోని ఆలయాలు బుధవారం శివనామ స్మరణతో మార్మోగాయి. భక్తులు తెల్లవారుజాము నుంచే ఆలయాలను సందర్శించి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సూర్యాపేటలోని ఉమా మహేశ్వరస్వామి, అన్నపూర్ణ సహిత విశ్వనాథస్వామి, రామలింగేశ్వరాలయం, సంతోషిమాత ఆలయంలోని సత్యసాంబశివస్వామి ఆలయాల్లో అర్చకులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సూర్యాపేట రూరల్ మండలం పిల్లలమర్రి గ్రామంలోని పురాతన శివాలయాల్లో మహాశివరాత్రి వేడుకలను ఘనంగా నిర్వహించారు. భక్తులు తండోపతండాలుగా వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి-సునీత దంపతులు, కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ ప్రత్యేక పూజలు చేశారు. నాగారం మండల కేంద్రంలోని శివాలయంలో మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి మాతృమూర్తి సావిత్రమ్మ జ్ఞాపకార్థం ఎస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు. ఈ వేడుకలకు మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి-సునీత దంపతులు, గుంటకండ్ల రమేశ్‌రెడ్డి- మణిమాల దంపతులు, గుంటకండ్ల సురేశ్‌రెడ్డి హాజరయ్యారు. అనంతరం ఎస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ చేశారు. మేళ్లచెర్వులోని స్వయంభు శంభులింగేశ్వర స్వామి ఆలయంలో మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి దంపతులు అభిషేక పూజల్లో పాల్గొన్నారు. మేళ్లచెర్వులో జాతీయ స్థాయి ఎద్దుల పందేలను కోదాడ ఎమ్మెల్యే పద్మావతి ప్రారంభించారు. మఠంపల్లి మండలంలోని మట్టపల్లి క్షేత్రంలో, నేరేడుచర్ల మండలంలోని చారిత్రక సోమప్ప ఆలయంలో, గరిడేపల్లి మండలంలోని కీతవారిగూడెం పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో, మునగాలలోని చెరువు గట్టు శివాలయం, హనుమాన్ రామలింగేశ్వర ఆలయంలో,మోతె మండలంలోని కూడలి సంగమేశ్వర ఆలయంలో, చివ్వెంల మండలం ఉండ్రుగొండలోని ఉమా మహేశ్వర ఆలయంలో, మద్దిరాలలోని స్వయంభు పార్వతీరామలింగేశ్వరస్వామి ఆలయంలో, అనంతగిరి మండలం చనుపల్లిలోని బాలకోటేశ్వర స్వామి ఆలయంలో, తుంగతుర్తిలోని స్వయంభు మహాదేవర లింగస్వామి ఆలయంలో శివరాత్రి వేడుకలను వైభవంగా నిర్వహించారు.

మేళ్లచెర్వులో ఎడ్ల పందేలు నిర్వహిస్తున్న దృశ్యం

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

చివ్వెంల, ఫిబ్రవరి 26: రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలైన ఘటన మండలంలోని ఉండ్రుగొండ శివారులో జాతీయ రహదారి నంబర్‌పై 65పై బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన ముగ్గురు వ్యక్తులు కారులో విజయవాడకు బయలుదేరారు. ఈ క్రమంలో ఉండ్రుగొండ శివారుకు రాగానే జాతీయ రహదారి వెంట మొక్కలకు నీళ్లు పోస్తున్న ట్యాంకర్ ఒక్కసారిగా కుడి వైపునకు టర్న్ తీసుకోవడంతో వెనుక నుంచి వచ్చిన కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో కారు అమాంతం లేచి పల్టీకొట్టి తిరగబడింది. కారు డ్రైవర్ మక్సూద్, మరో ఇద్దరు రసూల్, రఫీక్‌కు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికుల సాయంతో ముగ్గురిని సూర్యాపేటలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

బైక్‌ను ఢీకొట్టిన కారు..

కోదాడ రూరల్: బైక్‌ను కారు ఢీకొట్టడంతో ఓ వ్యక్తికి తీవ్రగాయాలైన ఘటన దోరకుంట శివారులోని 65వ నంబర్ జాతీయ రహదారిపై బుధవారం చోటుచేసుకుంది. మండలంలోని దోరకుంటకు చెందిన పిట్టల పాపయ్య తన బంధువుతో కలిసి బైక్‌పై కోదాడకు వస్తుండగా గుర్తు తెలియని కారు వెనుక నుంచి ఢీకొట్టింది. ప్రమాదంలో పాపయ్య తలకు తీవ్రగాయాలు కాగా అంబులెన్స్‌లో కోదాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స నిర్వహించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించారు.

కొత్త ఉపాధ్యాయులకు 28 నుంచి శిక్షణ

- హాజరుకానున్న 215 మంది

ఉపాధ్యాయుల కెరీర్ కౌన్సిలింగ్ కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ (ఫైల్)

సూర్యాపేట అర్బన్, ఫిబ్రవరి 26: రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించే దిశగా విద్యాశాఖ మరో నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వాలని నిర్ణయించింది. అందులో భాగంగా 2024 డీఎస్సీ నోటిఫికేషన్ ద్వారా జిల్లాలో నియమితులైన 215 మంది ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు ఈ నెల 28వ తేదీ నుంచి ప్రత్యేకంగా శిక్షణ తరగతులను నిర్వహించేందుకు విద్యాశాఖ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు. జిల్లాలో వివిధ సబ్జెక్టుల వారీగా ఎంపిక చేసిన 12 మంది డిస్ట్రిక్ట్ రిసోర్స్ పర్సన్లు (డీఆర్‌పీ) ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వనున్నారు. డీఆర్‌పీలు బ్యాచ్‌ల వారీగా షెడ్యూల్ ప్రకారం సూర్యాపేట రూరల్ మండలంలోని అనాజిపురం పాఠశాలలో టీచర్లకు ఈ నెల 28 నుంచి మార్చి 3వ తేదీ వరకు శిక్షణ ఇవ్వనున్నారు.

మూడు రోజులకు రూ.775..

శిక్షణకు హాజరయ్యే ఉపాధ్యాయులకు అవసరమైన సదుపాయాలు కల్పించేందుకు విద్యాశాఖ అధికారులు ఇప్పటికే 50 శాతం నిధులు విడుదల చేసినట్లు సమాచారం. ఉపాధ్యాయులకు మూడు రోజులకు గాను ప్రభు